సంజ చీకట్లు ఆలుముకుంటున్నాయి. కాంపౌండ్ లోని పూలమొక్కలు గాలికి అల్లల్లాడుతున్నాయి. అప్పుడే వికసిస్తున్న సంపెంగల సువాసన గాలిలో కలిసివచ్చింది.

ఏమీ తోచకుండా ఉంది. ఇంట్లో ఎవరూ లేరు. ఏదో ఎప్పుడూలేని ఒంటరితనం నన్ను బాధపెడుతున్నట్టనిపించింది. అవుట్ హౌస్‌కు వేసిన తాళం నన్ను వెక్కిరిస్తోంది.

స్వంత ఇల్లు కట్టించుకునేటప్పుడు అవుట్ హౌస్‌కూడా ఉండి తీరాలని పట్టుబట్టి కట్టించాను. ఎవరికి అద్దెకిచ్చినా ఇరుగుపొరుగు తోడుగా ఉంటారని నా ఆశ. ఇంతవరకూ అలాగే జరిగింది. నిన్ననే ఆ భాగం ఖాళీ అయింది. రేపో, మాపో ఎవరైనా వస్తారన్న నమ్మకమూ ఉంది.

ఆ ఇంట్లో దీపం వెలుగుతూ ఉండి మనుష్యులు మసలుతూ ఉంటే చాలు. పలకరించకపోయినా ఫరవాలేదు. మనుష్యులతో ఉన్నట్లే ఉండేది.

అవుట్ హౌస్ మూసిన తలుపులు చూస్తుంటే



మాత్రం జానకిని అన్ని కోణాల్లో నుండి పరిశీలించి తృప్తిపడుతున్నాను.

శలవుల్లో ఇంటికి వచ్చిన కృష్ణ,

"అమ్మా, సరోజ వచ్చిందా ?" అన్నాడు.

"లేదే ! ఏం ?" అన్నా.

"అహ. ఇల్లంతా కొత్తగా ఉంటేనూ !"

"అదా మన ఔట్ హౌస్‌లో లేదూ వాళ్ళమ్మాయి జానకి పనే ఇదంతానూ."

కృష్ణ ఉన్నన్ని రోజులూ జానకి ఎక్కువగా ఇటువైపుకు వచ్చేదికాదు. ఏ రెండుసార్లో వచ్చి కాసేవుండి వెళ్ళిపోయేది. ఒకరోజు కృష్ణ అన్నం తింటూ ఉండగా అడిగాను.

"వాళ్ల జానకి ఎలా ఉందిరా ?"

"ఎలా ఉండట మేమిటి ? బాగానే ఉంది."

"బి. ఏ. చదువుతోంది. మంచి పిల్ల. కాలేజీలో చదువుతున్నా కొంచెం కూడా గర్వంలేదు."

"ఇదివరకే చెప్పా వివన్నీ."

"అవునులే. చెప్పాను. మరోసారి చెబుతున్నా. ఆ అమ్మాయి గురించి నీ అభిప్రాయ మేమిటో చెబుదూ."

"మధ్య నా అభిప్రాయం దేనికీ అనే అడుగుతున్నా."

"అహ ! అడగవూ మరి ? అయితే చెబుతున్నా విను. ఆ అమ్మాయిని కోడలిగా చేసుకోవాలని ఉందిరా. పిల్ల లక్ష్మిలా ఉంది ఏమంటావ్ ?"

"అదా సంగతి. అవుట్‌హవుస్ కావాలని పట్టుబట్టి కట్టించింది ఇరుగూ పొరుగూ కోసం కాదన్నమాట. వియ్యమందాలనే ముందు చూపా! భలే అమ్మా" అంటూ వేళాకోళం పట్టించేశాడు.

"ఛ ! ఇష్టం లేకపోతే వద్దను కాని ఈ డొంక తిరుగు డెందుకూ ?" అంటూ కోప్పడ్డాను.

"నేనిప్పు డేమన్నా నేమిటి ?" అంటూ నావైపు చూసి నవ్వేశాడు.

# ఔట్ హౌస్

మెరుస్తున్న కళ్ళవంక చూసే, వాడి ఇష్టాన్ని గ్రహించాను. అందంగా ఉన్న వాడిమొహంలో సిగ్గుదొంతరలు తొంగిచూశాయి. 'పిచ్చినాయన' అనుకున్నా.

మర్నాడు మామూలుగా ఇంట్లో అడుగుబెట్టిన జానకి చేతిలో మల్లెల మాలపెడుతూ, దగ్గర కూర్చోబెట్టుకుని "ఈరోజు ఒ సంగతి అడుగుతాను. దాచకుండా చెప్పాలి మరి." అన్నాను. "అలాగే" అంది నవ్వుతూ.

"మా కృష్ణని చూశావుగా."

"చూడకేం పిన్నీ."

"పిన్నిని కాదు. అత్తయ్య నవాలని" అన్నాను.

బెదరిపోతూ నావేపు చూసి లేచి నిలబడింది జానకి. అపుడా పిల్ల మొహంలో వెలువడిన భావాలేమిటో సరిగ్గా చెప్పలేను. ఆశ్చర్యమూ, ఆవేదనా, దుఃఖమూ అన్నీ కలిసిన భావం నిశ్చేష్టురాలై కళ్ళు మూసుకుంది.

"అలా అయిపోయా వేమిటి జానకి ? నీ కిష్టం లేకపోతే చెప్పు. నీ కిష్ట మయితేనే పెద్దలతో మాట్లాడదామని ముందుగానే నిన్నడిగాను" అన్నాను.

జానకి కళ్ళు తెరచి ఒక్క నిముషం నావైపు చూసింది. ఆమె కళ్ల వెంబడి అశ్రువులు ప్రవహిస్తున్నాయి. తెల్లబోయాను. "జానకి" అంటూ ఆపిల్ల చెయ్యి పట్టుకోబోయాను. తప్పించుకుని క్షణమాత్రంలో నాకు కనిపించకుండా పారిపోయింది.

నాకేమీ అంతుపట్టలేదు. తొందరపడ్డానా అనుకున్నాను. ఎదిగిన పిల్ల. పెళ్లిమాటెత్తితే సిగ్గుపడాలి గాని ఆ కన్నీరేమిటి ? లోలోపల ఏదో భయంవేసింది నాకు.

రెండుక్షణాలాగి వాళ్ళింటివేపు వెళ్ళాను. హాల్లో నేలమీద జానకి పడిఉంది. వంటిమీద స్పృహ ఉన్నట్లు లేదు. పార్వతమ్మగారికి తెలియనట్లుంది. గట్టిగా పిలిచాను. వచ్చి కూతురి నా పరిస్థితిలో చూసి తెల్లబోయారు. గబగబా నీళ్ళు తెచ్చి మొహంమీద చల్లారు. కాని జానక్కి తెలివి రాలేదు. నేనే వెళ్ళి పక్క వీధిలోని డాక్టర్ని తీసుకొచ్చాను.

"అప్పుడప్పుడూ ఇలా అవుతూంటుందా ?" అడిగారు డాక్టర్.

"నాలుగేళ్ళ నుండీ లేదు. అంతకుముందు ఉండేది. అని బదులు చెప్పారు పార్వతమ్మగారు. కన్నీరు తుడుచుకుంటూ. నా కంతా అయోమయంగా ఉంది.

డాక్టర్ ఏదో ఇంజక్షన్ ఇచ్చాక తెలివి వచ్చింది జానకికి. త్వరగానే కోలుకుని మామూలుగా తిరగసాగింది. కాని, మా ఇంట్లోకి మాత్రం వచ్చేది కాదు. నేను పలకరిస్తే మాట్లాడేది కాని అందులో ఏదో వెల్తి కనిపించేది. జానకి నాకు దూరమయిందని తెలిసింది. కాని నేను చేసిన అపరాధమేమిటో తెలిసింది కాదు.

కాలేజీలు తెరిచారు. ఒకరోజు జానకి ఇంట్లో లేకుండా చూసి పార్వతమ్మగారినే అడిగాను. ఆరోజు జానకి తెలివి తప్పి పడిపోయిన రోజున నేను జానకితో మాట్లాడిన విషయం చెప్పాను. పార్వతమ్మగారు,


"అందుకే అలా పడిపోయిందన్నమాట. ఇంతవరకూ నాతోకూడా చెప్పలేదుమ్మండీ. దానికీ జన్మలో పెళ్లి యోగం ఉన్నట్లు లేదు." అంటూ కళ్ళు తుడుచుకున్నారు.

నాకంతా అయోమయంగా ఉంది. బంగారంలాంటి పిల్ల. "ఏం జరిగింది ?" అని ఎంతో ఆదుర్దాగా అడిగాను.

"మీరూ దానికి తల్లిలాంటివారు. మీతో చెబితే తప్పులేదు. మన మెవ్వరం దానికి చెయ్యగలిగింది లేదు. ఇది చాలా రోజుల సంగతి.

"మా అన్నయ్య కొడుకు అనంతం. చిన్నప్పటి నుండీ అనంతం బావంటే ప్రాణం జానక్కి. వాడూ అలాగే ఉంటూండేవాడు. వాళ్ళిద్దర్నీ భార్యాభర్తల్లా కిందే కట్టి మాట్లాడేవాళ్లం పెద్దవాళ్ళమంతా. అదే నాటుకుపోయింది వారి మనసుల్లో ... అనంతం చదువు పూర్తికాగానే ఇద్దరికీ పెళ్ళి చేసెయ్యా లనుకున్నాం. కాని, మా దురదృష్టం. ఆఖరి సంవత్సరం చదువుతూండగానే అనంతానికి టైఫాయిడ్ వచ్చింది. టెలిగ్రాం అందుకుని మేమంతా వెళ్ళాం. కాని అనంతాన్ని బ్రతికించుకోలేక పోయాం. జానకి చేతిని తన చేతిలో పట్టుకుని తీరని కోరికలతోనే ఈ లోకాన్ని వదిలిపెట్టాడు. జానకి కెవ్వున కేకవేసి తెలివి తప్పి పడిపోయింది. అంతే తరువాత మళ్ళీ మనుషుల్లో పడటానికి చాలా రోజులు పట్టింది. జానకి ఎవరితోనూ మాట్లాడేది కాదు. నవ్వేది కాదు. గలగలా నవ్వుతూ తిరిగే జానకి గంభీరంగా తయారయింది. ఏడవదు. ఎవరితోనూ తన దుఃఖాన్ని చెప్పుకోదు. అలాగే తిరుగుతూండేది.

43 వ పేజీ చూడండి




"పోర్టరు [కూలీ] కావాలాండి......"

"అక్కర్లే... మా ఆయన ఉన్నారులే......!"

"ఎన్నాళ్లని అలా ఉండటం. మేమూ పెళ్లి ప్రయత్నాలు చేశాం. ఇంకేముంది, వెంటనే మూర్ఛలు మొదలెట్టాయి. ఇక పెళ్లి ఆశ వదులుకున్నాం. ఈ జబ్బు ఏ మందులకు నయంకాలా. ఆఖరుకు తనే చెప్పింది. 'నా కిక పెళ్లి వద్దు. చదువుకుంటాను' అని. ఏలాగోలా తను మనసుల్లో పడటమే ముఖ్యం అనిపించి ఆగిపోయిన చదువు మళ్లీ మొదలు పెట్టించాం. అప్పటి నుండీ రోజులు మామూలుగానే గడిచిపోతున్నాయి. ఇప్పటికి నాలుగేళ్ల సంగతి ఇది. మే మున్నంత వరకు సరే. తరువాత తన గతేమిటా అని బాధగా వుంది మాకు. అబ్బాయికి చెల్లెలంటే ప్రాణం. కాని ఎల్లకాలమూ, అంటే పరిస్థితులు ఎటు పోయి ఎటు వస్తాయో అన్నదే బాధగా ఉంది" అంటూ నిట్టూర్చా రామె. నాకు ఏదో కథ వింటున్నట్టుంది. కాని ఆ కథలో నాయకి జానకి అని గుర్తుకు రాగానే కన్నీళ్లాగలేదు.

పెద్దవారు తమ సరదాలు, సంతోషాలకోసం చిన్నప్పటినుండీ పసివాళ్లను పరిహాసాలతో ఏడిపించి ఆనందిస్తూంటారు. కాని ఆ పసిహృదయాలు ఎలా పెనవేసుకుపోతాయో, వాళ్ల మనసులో ఎన్ని భావాలు చెలరేగుతాయో ఎవరికి తెలుసు ? "అదిగోనే నీ భర్త వచ్చాడు." అనగానే సిగ్గుతో పారిపోయే పిల్లని చూసి నవ్వేయటంతో తీరిపోతుంది వారి సరదా. కాని, జానకిది ఎంత లోతు మనసు. మనసుకు తగిలిన గాయం మానటానికి కాలమే సంజీవిని అంటారు. కాని అదే జానకి మనసులో ఎంతగా చోటు చేసుకుంటే ఇలా నిలిచిపో గలుగుతుంది?

తరువాత ఆర్నెల్లకుపైగా అక్కడున్నారు వాళ్లు. వెళ్లిపోయేందుకు మూడు రోజులు ముందు జానకి మా యింట్లోకి వచ్చింది. ఆరోజు తరువాత ఇప్పుడే మళ్లీ ఇంట్లోకి అడుగుపెట్టడం ఆపిల్ల. నా కెందుకో భయం వేసింది. ఆ పిల్ల మనసు నొప్పించకుండా ఉండాలని ఎంతో జాగ్రత్తగానే ఉన్నాను. కాని జానకే అడిగింది.

"అమ్మ మీతో అంతా చెప్పింది కదూ ?"

"ఆఁ"

"కాని పిన్నీ! వాళ్ల కింకో సంగతి తెలియదు. మాకు పెళ్లయిపోయింది ఇదిగో" అంటూ తన మెళ్లోని లాకెట్ తీసి చూపించింది. అందులో నవ్వుతూన్న ఒ కుర్రాడి ఫోటో ఉంది.

"మా పెదనాన్న కూతురి పెళ్లిలో మాంగల్యధారణ అవుతూండగా అనంతం బావ దీన్ని మెడలో వేసి "ఇదే మన పెళ్లి" అని నవ్వాడు. పెద్దవాళ్ల ఎదుట పెళ్లి కానంతమాత్రాన ఇది పెళ్లి కాకపోతుందా ? నే నిప్పుడు విధవను కానా ? నాకు మళ్లీ పెళ్లి చెయ్యాలని పెద్దల ఆరాటం...."

నేను ఏదో చెప్పాలని నోరు తెరిచాను.

"మీరు చెప్పేది నాకు తెలుసు. ఇప్పుడు ఎంతో మంది చాల విధవలు పెళ్లి చేసుకుంటున్నారు నిజమే. వాళ్ల కిష్టమైతే చేసుకుంటారా. కాని నేనెప్పుడూ అలా ఆలోచించలేదు. నా తత్వానికి సరిపడదు." అంది.

"అలాగే అనుకో. కానీ అమ్మాయ్ మీ అమ్మా నాన్న ఉన్నంతవరకూ ఫరవాలేదు. తరువాత ఎలాగన్నదే వాళ్ల బాధ" అన్నా.

# ఔట్ హౌస్

14 వ పేజీ తరువాయి

"పెళ్లి కాకపోతే ఎలాగన్నది వాళ్ల బాధయితే పెళ్లయితే ఎలా గన్నది నా బాధ. ఆమాట తల్చుకుంటూనే తెలివితప్పి పడిపోయే నేను, జీవితాంతం ఇంకో మనిషిని భరించగలనా ? నాతోబాటు ఇంకొక జీవితాన్ని కూడా శూన్యంలోకి లాగటమే అవుతుంది. కాదంటారా ?"

ఆ మాటకేం బదులు చెప్పాలో తెలియలేదు. మౌనంగా ఉండిపోయాను.

వాళ్లు వెళ్లిపోయిన రెండవరోజు దిగారు శంకర్రావుగారు. భార్య సుశీలమ్మగారికి ముప్పైఆరు, ముప్పైఎనిమిదే ళ్లుంటాయి. కాని ఇంకా చిన్నగా కనిపించేవారు. వారికి పదేళ్ల కుర్రాడు రఘు, ఎనిమిదేళ్ల పిల్ల సుగుణ.

చిన్నపిల్లలతో ఇదో కొత్తరకమైన మార్పు. పిల్లలు అల్లరిచేస్తూ ఆడుకుంటూ కాంపౌండంతా తెగ తిరిగేవారు. సుగుణ చిన్న బిందె తీసుకుని నాతోబాటు మొక్కలకు నీళ్లు పోసేది. మహా చురుకైన పిల్లలు. చదువులోనూ అంతే. మంచి మార్కులు తెచ్చుకునేవారు.

అస్తమానం "మామ్మ, మామ్మ' అంటూ ఇంట్లోకి పరుగెత్తుకుని వచ్చేవారు. సుశీలమ్మగారు మధ్యాహ్నం పనంతా అయ్యాక ఎప్పుడయినా వచ్చేవారు. నేను వెళ్లే అవసరమే ఉండేదికాదు.

ఒకరోజు రఘూ, సుగుణా "మామ్మా మా ఇంటికి రావాలి" అంటూ చెరో చెయ్యి పట్టుకుని లాక్కుపోయారు. అలా వాళ్లు అల్లరి చేస్తూంటే మా పెద్దబ్బాయి పిల్లలు గుర్తుకొచ్చారు.


సుశీలమ్మగారితో మాట్లాడుతూంటే అక్కడి టేబుల్‌మీది దంపతుల ఫొటో నన్నాకర్షించింది. ఎవరిదని అడిగాను. "మా అమ్మాయీ, అల్లుడూ. పెళ్లయి రెండేళ్లయింది. ఇపుడు అయిదవ నెల. పురిటికి తీసుకురావాలి" అన్నారు సుశీలమ్మగారు. ఫోటో చేతికి తీసుకుని చూశాను. అమాయికంగా వికసించిన గులాబి పువ్వులా ఉంది. ఇంట్లో చిన్న పిల్లల కేరింతాలు విని ఎన్నాళ్లయిందో, వాళ్ల మ్మాయి పురిటికి వస్తుందని విని ఆనందమయింది.

ఏడో నెల్లో గాబోలు శంకర్రావుగారు వెళ్లి కూతుర్ని తీసుకొచ్చారు. వాళ్లు బండి దిగుతూంటే నేను తలుపు దగ్గర నిల్చున్నా. నా కిప్పటికీ బాగా జ్ఞాపకం. సన్నగా కళ్లల్లో జీవమే లేనట్టుగా ఉన్న ఆ అమ్మాయి తండ్రితోబాటు లోపలికి వచ్చింది. ఫోటోకీ, ఈ పిల్లకి ఏమాత్రం పోలికల్లేవు. ఎముకలు పొడుచుకొచ్చినట్టున్నాయి. కడుపుతో ఉన్నా ఏమాత్రం నిండుదనం లేదు.

సుశీలమ్మగారు కూతుర్ని డాక్టర్‌కి చూపించారు. నీరసమని చెప్పి తగ్గటానికేవో టానిక్కులు రాసిచ్చారు. కాని, వచ్చినప్పుడెలా ఉందో అల్లాగే ఉంది ఆ అమ్మాయి, ఇందిర. ఆమె నవ్వగా చూడలేదెప్పుడూ నేను.

ఒకరోజు మధ్యాహ్నం ఇందిర భోంచేసి పడుకున్నాక సుశీలమ్మగారు మా ఇంటికి వచ్చారు.

"పిల్ల కేదో మనసులో బాధ ఉన్నట్టుంది. ఈ సమయంలో అలాంటివి ఉండటం మంచిది కాదు." అన్నాను మాటవరుసగా.



"దాని మనో రోగం తగ్గేదికాదు, ఈసారి ఈ గండం గడిచివెలా బయటపడుతుందా అని బెంగగా ఉందండి నాకు" అన్నారామె.

ఈ పిల్ల జీవితంలో ఏం రాశావురా దేవుడా అను కున్నా మనసులోనే. ఆమె చెప్పినదాని సారాంశ మిది.

ఇందిర వాళ్లకు మొదటిపిల్ల. ఎంతో గారా బంగా పెంచారు. ఎస్సెల్సీదాకా చదువుకుంది. అమాయకమైన పిల్ల. ఏమాత్రం గడుసుదనం లేదు. పుస్తకాలు చదువుకుంటూ అలా ఊహా లోకంలో విహరించే మనస్తత్వం.

తల్లి దండ్రి మంచి సంబంధమే చూశారు ఇందిరకు. కుర్రవాడు బి. ఏ. పాసయ్యాడు. పల్లెలో కావలసినంత భూమీ, లంకంత ఇల్లూ. ఒక్క పల్లెటూరన్న మాట తప్ప మరింకేం లోటూ లేదు. చదువుకున్నవాడు కదా, ఎక్కడైనా ఉద్యోగం చూసుకోకపోతాడా అన్న ఆశతో కుర్రాడి రూపమూ చదువూ చూసి పెళ్ళి చేశారు. కాని

# ఔట్ హౌస్

అతను ఉద్యోగం చేయదల్చుకోలేదు. పల్లెటూ ళ్లోనే స్థిరపడ్డాడు.

ఆ ఇంట్లో అడుగు పెట్టగానే ఆ వాతావరణం ఇందిరను ఉక్కిరిబిక్కిరి చేసింది. అత్తవారింట్లో అందరూ అతి మొరటు మనుష్యులు. ఏమాత్రం నాజూకు లేదు. ఇంట్లో చచ్చే చాకిరీ పైగా అత్తగారి తీక్ష్ణమైన వాగ్బాణాలు, చేతగాకపోయినా పను లన్ని నేర్చుకుని సర్దుకుని పోగలిగింది ఇందిర. కాని మనసుకు తగిలే గాయాలకు తట్టుకోలేక పోయింది. కారణం భర్త మనస్తత్వం. చదువు కున్నాడన్న మాటేగాని సంస్కారం సున్న. పైగా పూలరంగడు. ఇక ఇందిర కక్కడ చోటెక్కడిది? ఆ వేడికి తట్టుకోలేక మలమలా మాడి పోయింది.

తల్లి కాబోతున్నానన్న సంతోషం ఒక్కటే ఆమెకు కనిపిస్తున్న కాంతిరేఖ. కానీ తనున్న పరి స్థితుల్లో బిడ్డను కళ్లారా చూడగలనా అన్నదే బెంగ. ఇక్కడికొచ్చేముందు రాత్రి ఇక ఆపుకోలేక ఆ మాటే భర్తతో అంటే,

"భస్తే పీడా వదులుతుంది. తేభ్యం మొహమూ, నువ్వూనూ. కాస్త ఆరోగ్యం ఉన్నదాన్ని కట్టుకు సుఖపడతాను." అన్నాట్ట. అంతకన్నా మంచి మాటలు అతన్నుండి ఆశించకపోయినా అసలే జీవి తంమీద ఆశ కరువైన ఆ పిల్లను ఆమాటలు మరింత క్రుంగదీశాయి.

"నువ్వూరికే బెంగపెటుకోకమ్మా. ఇల్లా బ్రతి కడంకన్నా చావడం నయం." అంటుంది ఏంచేయ మంటారు. చెప్పండి" అని కన్నీరు కార్చారు.

ఎంత శ్రమకయినా ఓర్చుకోగలదు స్త్రీ. కాని భర్త హృదయంలో విశ్రమించే ఆ అవకాశంలేని స్త్రీకి చోటెక్కడుంటుంది? ఏమని ఓదార్చాలో తెలియలేదు నాకు.

తరువాత వారం రోజులకు గాభరాలు సుగుణ పరిగెత్తుకుంటూ వచ్చి :

"అక్కయ్య గది తలుపులు తియ్యడం లేదు. అమ్మ నిన్ను పిలుస్తోంది రామామ్మా" అంది ఆత్రు తతో వెళ్లాను. గదికి కిటికీలన్నీ మూసి ఉన్నాయి. తలుపులు లోపల గడియ వేసి ఉన్నాయి. ఆఖరికి తలుపులు బద్దలు కొట్టాల్సి వచ్చింది. ఇందిర తెలివి లేని పరిస్థితుల్లో మంచంమీద పడి ఉంది. వెంటనే హాస్పిటల్లో అడ్మిట్ చేశారు. అక్కడ మూడ్రోజులు కొట్టుకులాడింది ఇందిర ప్రాణం. మళ్లీ తెలివిరాకనే ప్రాణం పోయింది. ఇక ఆ తల్లి దండ్రుల బాధ చూడలేక పోయాను. రఘూ, సుగుణ అక్కయ్య కోసం బెంగెట్టుకుని ఏడ్చి ఏడ్చి అలసి పోయారు. ఈ వార్త అందినా ఇందిర భర్త తాలూకు వాళ్లెవరూ తిరిగి చూడలేదు. సుశీ లమ్మగారి తల్లి వచ్చారు. ఇందిరంటే ఆమెకెంతో ప్రాణంట. "ఆ కటికవాళ్ళ చేతిలో పెట్టి ఇందిరను చంపుకున్నామే తల్లీ" అంటూ రోదించిందామె. రఘు భద్రంగా దాచుకున్న సంచితెచ్చి మా ముందు కుమ్మరించి "ఇవన్నీ అక్కయ్య బాబుకోసం దాచాను. ఇపుడేం చెయ్యాలో చెప్పండి" అని పొర్లిపొర్లి ఏడి చాడు. రంగురంగుల గిలకలు, చిన్న చిన్న బొమ్మలు ఉన్నాయందులో.

సుశీలమ్మగారి తల్లి వారం రోజులపాటక్కడే ఉన్నారు. అందర్నీ తమ వూరికి తీసుకుపోవాలని ఆమె సంకల్పం. శంకర్రావుగారుకూడ సెలవుపెట్టి, అందరితోబాటు వెళ్లిపోయారు.

నాకూ కష్టంగానే ఉంది. మాటిమాటికీ సరోజ గుర్తుకు రాసాగింది. ఒకసారి వెళ్లివద్దామని మా వారితో పోరుపెట్ట సాగాను. వెళ్లి సరోజను చూసే వరకూ నా మనసు కుదుటబడలేదు. ఆయన వారం రోజులు మాత్రం ఉండి వచ్చారు. నేను మాత్రం పెద్దబ్బాయీ, కోడలూ పిల్లల్ని చూడందే రానన్నాను. అక్కడా ఓ పదిహేను రోజులున్నాను. పిల్లలతో రోజులు గడచిందే తెలీలా.

"ఇక్కడ ఉండిపొండత్తయ్యా." అంటూ బల వంతపెట్టింది పెద్ద కోడలు.

"అవునే అమ్మాయ్. అక్కడెవరుంటారు. ఈ వయస్సులో ఆయన్ను ఉడకేసుకు తినమంటావా? అన్నాను. ఆ మాట విని కోడలు చిన్నబుచ్చుకుంది. "మీారెలక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటే బావుం టుందే అమ్మాయ్. స్వంత ఇల్లు కట్టుకున్నామన్న



మాకుగాని అందరం కలిసి ఉన్నదెప్పుడు చెప్పు? మీరూ అక్కడికే వచ్చి, కృష్ణకీ పెళ్లయిందంటే మా క్కావలసిందేముంది చెప్పు?'' అని నచ్చ చెప్పాను.

నెలరోజులతర్వాత ఇంటిముందు రిక్షా దిగేసరికి మొక్కలకు నీళ్లు పోస్తున్న పద్దెనిమిదిదేళ్ల పిల్ల

''ఓహో పిన్నిగారు వచ్చేశారన్నమాట. రండి, రండి'' అంటూ గేటు తెరచినా చేతిలోని సూట్ కేస్ అందుకుంది. తెల్లబోయి చూస్తుంటే ''బాబాయ్ రాయలేదన్నమాట, నా సంగతి పోని వ్వండి. అదిగో ఆ అవుట్‌హవుస్‌లోని అమ్మాయిని'' అంటూ సూట్‌కేస్ మెట్లమీద పెట్టి తాళం చెవి కోసం పరిగెత్తింది. అపుడు గుర్తుకొచ్చింది. శంకర్రావుగారు వెళ్లిపోయారని, కొత్తవారు వచ్చారని మావారు రాసిన సంగతి.

తాళంచెవి తెచ్చి తాళం తీసింది.

''మీరొస్తారని బాబాయ్ చెప్పారు. ఇల్లంతా తుడిపించాం. మీరు స్నానం చేయండి పిన్నీ. నేను కాఫీ పట్టుకొస్తాను.''

ఆపిల్ల మాటల కాశ్చర్యమౌతున్నాను నేను అంతలో

''స్నానానికి వేన్నీళ్లు కావాలా పిన్నీ'' అంది.

''ఏవిటమ్మాయ్ నేను మా ఇంటికి కాక మీ ఇంటికి వచ్చినట్టున్నానే. నీ మర్యాదలూ అవి చూస్తే'' అన్నాను నవ్వి.

'కాక. ఇప్పుడు వేనేగా ఇల్లు కనిపెట్టుకుని ఉన్నదీ'' అని గంభీరంగా అనబోయి నవ్వేసింది.

'అది సరేగాని అమ్మాయ్. నా సంగతులు ఇన్ని తెలుసుకున్నావుగాని నేను కాఫీ తాగనన్న సంగతి చెప్పలేదా మీ బాబాయ్. ఇహ నేను వేన్నీళ్లు పోసు కోను. సరేనా?'' అని సంచిలోనుండి కొన్ని పళ్ళూ, పూలూ తీసి ఆ పిల్ల చేతిలో పెట్టాను.

''అంటే ఇక వెళ్లమని శెలవన్నమాట'' అని చకచకా మెట్లు దిగి వెళ్లిపోయింది. నేనూ నీళ్లు పోసుకుని నా పనులు పూర్తిచేసుకుని బయటపడే సరికి సిద్ధంగా ఉంది. నన్ను చూడగానే

''పరిచయంచేస్తున్నా. ఈమె మాఅమ్మ.'' అంది.

నలభయ్యేళ్ల వితంతు వొకామె నవ్వుతూ నమస్క రించింది.

''నా చెల్లి రమ బడికి వెళ్లింది. అన్నయ్య ఆఫీసుకు వెళ్లాడు. మేమింతమందిమేనన్నమాట.''

''ఇంతకూ నీ పేరేమిటో చెప్పనేలేదే?'' అన్నా.

''ఇంకా తెలియలా? మాటల మల్లక్క'' అంది చటుక్కున.

''ఎప్పుడూ ఇంతే. శుద్ధ వాగుడు కాయ. నిముషం వూరుకోదు గదా. మిమ్మల్నిప్పుడే విసి గిస్తోందన్నమాట. ఏమిటే పేరడిగితే ఆ పొగరు మోత్తనం.'' అన్నారు ఆమె.

చేతులు కట్టుకుని తలవంచుకుని నిలబడి ''నా పేరు మాలతి అండి'' అనేసి పకపకా నవ్వేసింది.

''ఒక్క నిమిషం గంభీరంగా ఉండటం చేతగాదు కదా'' అన్నారు మాలతి తల్లి.

ఇలా పరిచయమయింది మాలతీ వాళ్ల కుటుంబం.

వాళ్లన్నయ్యకు నూట యాభై రూపాయల జీతం. మాలతి హిందీ టీచరుగా పనిచేస్తోంది. చెల్లెలు థర్డ్‌ఫారమ్ చదువుతోంది. గుట్టుగా కాలక్షేపం చేస్తున్నారు.

ఇదివరకు అవుట్ హౌస్‌లో దిగినవాళ్లతో నాకు కలిగిన మనశ్శాంతి వల్ల ఇతమీదట ఎంతలో ఉండాలో అంతలో ఉండాలనుకున్నమాట వాస్తవం. కానీ మాలతి నా తోనే కాదు ఇంట్లోఅందరితోనూ ఎంతో చను వుగా మెలగేది. వాళ్లు ఆ ఇంట్లో దిగినప్పటినుండి మా వారిని చెయ్యి కాల్చుకోనియ్యకుండా రెండు పూటలా వాళ్లింటినుండే భోజనం తెచ్చి పెట్టే దట. ఉదయం టైముండదు గనుక వంట అంతా తెచ్చి పెట్టి గిన్నెల్లో అమర్చి వెళ్లిపోయేదట. రాత్రిళ్లు మటుకు తనే స్వయంగా దగ్గర కూర్చుని వడ్డించేదట. మావారు:

''ఆ అమ్మాయి వంకాయి కూర వండుతుందీ, మా భేషుగ్గా ఉంటుందనుకో'' అని మెచ్చుకున్నారు.

ఆఖరికి కృష్ణనికూడా విడచి పెట్టలా మాలతి. నాడొచ్చిన రోజు తను ఇంట్లోకి రాగానే

''అన్నయ్యొచ్చినట్టున్నాడే. గది తెరచి ఉంది. అవునా పిన్నీ?'' అంది మళ్ళా.

''కాఫీ నాకూ ఓ గ్లాసు ఇవ్వటం మరిచిపోకేం అన్నయ్యనీ కేకేసి వస్తాను'' అంటూ లిప్పగా కృష్ణ గదిలోకి వెళ్లి:

---

కొందరు పెద్దమనుష్యులు అనాథాశ్రయం స్థాపించి ఒక ధనవంతుని దగ్గరకెళ్లి, ధనవంతునితో ''ఏమండీ! మేము అనాథాశ్రయం స్థాపించాము. ఏమైనా యిప్పించండి'' అన్నారు.

ధనవంతుడు ''నా దగ్గర ముగ్గురు అనాథ బాలలున్నారు. వారిని తీసికెళ్లండి'' అన్నాడు.

సుబ్బారెడ్డి (కోవెలకుంట్ల)

---

''ఇదిగో అన్నాయ్ కాఫీకి వంటింట్లోకే రావాలి. ఎవరా ఈ చెల్లాయ్ అని చూస్తున్నావా? నేను మా పిన్ని కూతుర్నిలే త్వరగా రా'' అంటూ తీసుకు వచ్చింది.

తెల్లబోతూవంటింట్లోకిఅడుగుబెట్టాడుకృష్ణ.

''మన అవుట్ హవుస్‌లో వాళ్ల అమ్మాయిరా, మాలతి'' అంటూ పరిచయం చేశాను.

మాలతి అంత అరమరిక లేకుండా, కబుర్లు చెప్పేస్తుంటే ఎవరు మాత్రం ముభావంగా ఉండగలరు? కృష్ణకూడా చనువుగానే పలకరించే వాడు. ఓ మారు అన్నాడుకూడా:

''ఇన్ని రోజులకు నిజమయిన సరోజ దొరికింది అమ్మా నీకు'' అని.

సంవత్సరాలు గిర్రున తిరిగిపోతున్నాయి. కృష్ణ చదువు పూర్తయి ఉద్యోగంకోసం చూస్తున్నాడు. పెద్దబ్బాయికి ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయ్యే సూచనలేవీ కనుపించటం లేదు.

మాలతి ఇంట్లోవాళ్లంతా ఎంతో మంచివాళ్లు. ఆ మాటంటే నీ మటుకు నీకు అందరూ అలాగే కనబడతారులే అంటాడు కృష్ణ.

ఉన్నట్టుండి ఓ రోజు మాలతి వాళ్లమ్మగారు చెప్పిన వార్తవిని బెదరిపోయాను. మాలతి అంత పని చేస్తుందంటే నమ్మలేక పోయాను. ''మీరు చెబితే వింటుంది. కాస్త నచ్చచెబుదురూ'' అందా విడ. ఎవరో అబ్బాయిని ప్రేమించిందట. ఇంట్లో వాళ్లు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా అతడినే పెళ్లి చేసుకుంటానని కుండబద్దలు గొట్టినట్టు చెప్పేసిందట. వాళ్లన్నయ్య మొదటి నుండి అదోమాదిరి స్వభావం కలవాడు. సంకోచం అతనికి. చెల్లెలి నిర్ణయాన్ని మార్చటానికి అతనివల్ల కాలేదు. ఇహ తల్లి. మాలతి అన్ని విషయాలు విడమర్చి చెబుతూంటే మాట్లాడే అవకాశమే దొరికేది కాదామెకు. ఆఖరికి నా వరకూ వచ్చింది.

ఓ శలవు రోజున తీరికగా వచ్చింది మాలతి.

''ఇహ చెప్పండి పిన్నీ.మీదాకా వచ్చిందిగా గ్రంధం అమ్మ చెప్పిందిలెండి. అందరూ కాదనే వారే. మీరే మంటారు?''

ఏమన్నా? నవజ కళ్లముందు మెదిలింది. నేనేం బదులుచెప్పక వూరుకున్నాను.

''ఇపుడు నా కెన్నేళ్లో తెలుసా పిన్నీ'' అంది మళ్లీ మాలతి.

''పద్దెనిమిదేళ్లుంటాయి కదూ?'' అన్నా.

''కాదు ఇరవయి రెండు దాటి ఇరవైమూడో సంవత్సరం నడుస్తోంది తెలుసా?''

''అయితే ఏమంటావ్?''

''అదే చెప్పబోతున్నా. అన్నయ్యకేమో ఇరవ య్యేనిమిది దాటాయి. నాకు పెళ్లయితే గాని అతనికి కాదు. కట్నం లేందే తగిన సంబంధం రాదు—మా అమ్మ వాళ్ల దష్టిలో. కట్నం ఇచ్చుకునే తాహతు లేదు గనుక నేనూ, నానుండి అన్నయ్యా ఇల్లా ఉండాల్సిందే. మా ఇద్దరి సంపాదన తప్పితే వెనుక ఆస్తిపాస్తులేవీ లేవు కదా. ఉన్నదేదో నాన్న పోయాక అన్నయ్య చదు వుకు హరించుకుపోయింది. రమ పెళ్లికి తయా రుగా నిల్చుంది. మమ్మల్ని ఆక్షేపించేవాళ్లే గాని అక్కరతో ఆదుకునే బంధువు లెవరూ లేరు. అమ్మకూ ఇద్దరు అన్నయ్య లున్నారు. ఏం లాభం? ఓమారు చిన్నమామయ్య ఓ సంబంధం తెచ్చాడు. ఆయనకి యాభైఏళ్లుంటాయి. ఇంటినిండా గంపెడు పిల్లలు. ''చస్తే చేసుకోను పో''మ్మన్నా. దాంతో ఆయనకి కోపంవచ్చి మా గడప తొక్కడం మానేశాడు. ఇంతలో నా ఖర్మ మా పెద్దత్తయ్య వురుడొచ్చి చనిపోయింది. ఇహ వాళ్ల కళ్లు నామీద పడ్డాయి. ''పరాయివాళ్ల కయితే ఇవ్వకపోవటం సబబే గాని మీ సొంత అన్నయ్య ఇల్లు నిలబెట్టలేవూ'' అని వేపుకు తిన్నారు అమ్మని. కాదనటంతో వాళ్లూ దూర మయ్యారు నాకు. అంతా మా మంచికేలే అని పించింది నాకు.

''అన్నయ్యకు సంబంధా లొస్తున్నాయి గాని 'ముందు మా పిల్లకి ఎక్కడయినా మంచి సంబంధం చూసిపెట్టండి' అంటుంది. అమ్మ చాదస్తంగాని వాళ్ల పిల్లకు సంబంధాలు వెతుక్కోలేకనే చస్తున్నారు గదా. ఇంకొకళ్లకి కూడా ఎలా వెతికి పెట్టగలరు? ఇంతోటి సంబంధం ఎక్కడా దొరకదనా? అమ్మకు చెబితే తెలియదు. ఏం

# పాదాలలో ఆనెలు

పాదాలలో ఆనెలు, కండలు పెరిగి, వ్రేళ్లు పాతుకుపోయి పాదము నేలపై బెట్టలేక రాళ్లు తగిలిన త్రుళ్లిపడు వారు పై పూతగా వాడిన వ్రేళ్లతోసహా మాయంచేయు గల వంటికి. వెల పోస్టు ఖర్చులతో రు. 4—25న.పై.

కొక్కోకము చిత్రపటములు గలది. రు. 1—50
దాంపత్య రహస్యములు ... రు. 3—00
తెలుగు హిందీ స్వయంశిక్ష రు. 4—50

పోస్టు ఖర్చులు ప్రత్యేకము.

ప్రభ అండ్ కో.

3, మలయ పెరుమాళ్ వీధి, మద్రాసు—1.



దగ్గు నివారిణి తిరగపెట్టకుండా దగ్గును యిప్పుడే నిర్మూలించండి. ఖరీదు రు.157-15 ట్రయల్ రు 12—13 న. పై.
చెవుడు పూర్తి కోర్సు ద్వారా చెవుడు పూర్తిగా నయమగును. పూర్తి కోర్సు రు. 147-15. ట్రయల్ రు. 17—97 న. పై.
కంటిలోని పొర, వక్కమెల్లనా, కాకపోయినా, ఆపరేషన్ లేకుండా రు. 87—97 న.పై.లకు తప్పక నయం చేయబడును.

జాబులు ఇంగ్లీషులో వ్రాయండి.

DR. SHERMAN, F. C. S.
181, R. N. Guha Road, Calcutta-28.







# ఔట్ హౌస్

చెయ్యాను. చెప్పండి. అన్నయ్యకు పెళ్లి కావాలి. వాళ్లు సుఖంగా ఉండాలి. అదే నా ఆశ. అందుకే మురళి పెళ్లి చేసుకుంటా నన్నప్పుడు సరేనన్నా. మా శాఖ కాదన్న లోటూ లేదు. అమ్మా వాళ్లెందుకొప్పుకోరో నా కర్థంకాదు. మనవాళ్లెవరూ మన గడప తొక్కరంటుంది. ఇప్పుడు వాళ్లొచ్చి మమ్మల్ని ఉద్ధరించేది అంటూ ఏముంది గనక! అన్నయ్యకీ పెళ్లవుతుంది. ఇక రమ సంగతి. అప్పటి పరిస్థితినిబట్టి ఎలా జరగాలో అలా జరుగుతుంది.

"పిన్నీ మీరు అమ్మకు నచ్చచెప్పరూ? వాళ్ల ఆశీర్వాదం లేందే పెళ్లి చేసుకోవటం నా కిష్టం లేదు. కాని తప్పదంటుంది. మొన్ననే రిజిస్ట్రార్ ఆఫీసుకు అప్లికేషన్ పెట్టుకున్నాం.

"మీరూ నన్నాశీర్వదించరా పిన్నీ?"

మాలతి కళ్లు ఎర్రగా ఉన్నాయి. గలగలా మాట్లాడుతూ చలాకీగా తిరిగే పిల్లలో తన కుటుంబాన్ని గురించి ఇంత ఆలోచనా, జీవితాన్ని గురించి ఇంత ఆవేదనా ఉన్నాయని నా కింత వరకూ తెలియదు. నా కళ్లు చెమర్చాయి.

"ఎందు కాశీర్వదించనమ్మా? నువ్వు ఎన్నటికీ జీవితంలో సుఖపడాలని మనఃపూర్వకంగా ఆశీర్వదిస్తున్నాను." అన్నాను.

ఆనందం పట్టలేక నన్ను గట్టిగా పట్టుకుని, "మీరన్నా గ్రహించారు నా కంతే చాలు" అంది.

నే నెంత చెప్పినా నా శ్రీవారు ఒప్పుకో లేదు. పైగా నేను మాలతిని పాడుచేసుకుని వస్తున్నానని కోపమొచ్చినట్టుంది.

మాలతి పెళ్లికి నేనూ, మావారూ, కృష్ణా అందరం వెళ్లొచ్చాం. మురళికి తల్లి తప్ప మరెవ్వరూ లేరు. మాలతికి ఎంతో ఆనందంగా ఉంది మేము రావటం.

"తల్లీ, అన్నయ్యా లేని లోటు కనిపించకుండా చేశారు" అంటూ కన్నీరు పెట్టుకుంది. మురళి ఎంతో నెమ్మదిగా మాట్లాడాడు. వాళ్లిద్దరూ సుఖ పడగలరనే అనిపించింది నాకు. వచ్చేటప్పుడు అంది.

"అప్పట్లో పిన్నీ, నేను ఉద్యోగం వదిలిపెట్టను. అయినా ఇష్టపడ్డారు" అంది.

నిజమే. మంచిదే అనిపించింది.

రెండవసారి సరోజను అత్తవారింటికి పంపించి నంత పనయింది నాకంతా.

మాలతి అన్నట్టు ఆర్నెల్లు తిరక్కుండానే వాళ్లన్నయ్యకు పెళ్లయింది. జరుగుతుండగానే వాళ్లు ఇళ్లు మారారు.

ఆసారి ఎలాంటివాళ్లొస్తారో అనుకుంటూ ఉండగానే నేను వచ్చేశానండి. మా వారితో ఎవరో కొత్తవాళ్లొస్తున్నారు. లేచి ఇంట్లోకి వెళ్లాను.

"ఇదిగో, ఆ తాళంచెవి ఇలా పట్రా. పిల్లల్ని చూసుకుని రేపే దిగుతారట. మంచి రోజట రేపు" అన్న మావారి కంఠం వినబడింది.

తాళంచెవి ఇచ్చి రేపటినుండి కొత్తవారితో పరిచయం అనుకుంటూ ఇంట్లోకి అడుగు పెట్టాను.

★